## అగ్నిప్రవేశం చేయకనే ఆమె అగ్నిపునీత ఎలా అయింది?

# శాంతి నారాయణ కథ

# మట్టిమరకలు

హాస్పిటల్ ముందు రిక్షా ఆగింది. గౌతమ్‌రావు రిక్షాలో నుంచి కిందికిదిగి ఆదుర్దాగా లేడీస్‌వార్డులోకెళ్ళాడు.

నైట్‌డ్యూటీలో వున్న నర్స్ రాధ అంత రాత్రి వేళ అలా వచ్చిన గౌతమ్‌రావును చూడగానే కంగారు పడింది. అతడామె దగ్గరకెళ్ళి బాధగా జరిగిన సంగతిని టూకీగా చెప్పి బయట రిక్షాలోవున్న అహల్యను లోనికి తీసుకురావడానికి సహాయాన్ని కోరాడు. అతడు డాక్టర్ పార్వతికి దగ్గరి బంధువు కావడంతో ఆమె వెంటనే రిక్షాలోవున్న అహల్యను స్ట్రెచర్‌మీద లోనికితెచ్చే యేర్పాటు చేసింది. డ్యూటీలో డాక్టర్ పార్వతిగారే వున్నారని ఆమెకోసం నర్స్ పరుగెత్తింది.

పది నిమిషాల్లో డాక్టర్ పార్వతి వచ్చింది. కన్సల్టింగ్ రూములో బెడ్‌మీద మూలుగుతూవున్న అహల్యనూ, ఆమె పక్కనే దీనంగా నిల్చున్న గౌతమ్‌రావునూ చూసి డాక్టర్ ఆదుర్దాగా ఏమయిందని అడిగింది. ఆమెను చూడగానే రావు కళ్ళనిండా నీళ్ళు నింపుకొని కాసేపు మాటలు రానివాడయ్యాడు. ఆమె గుచ్చిగుచ్చి అడగడంతో మెల్లగా ఆయాసపడుతూ జరిగిన విషయమంతా చెప్పాడు.

పార్వతి వెంటనే డోర్ వేసెయ్‌మని నర్స్‌తో చెప్పి అహల్యను పరీక్షచేసి రెండింజెక్షన్లు చేసింది. ఆమె పొత్తి కడుపుమీద బలంగా దెబ్బ తగిలిందనీ గర్భం చిదిగిపోయిందనీ పరిస్థితి ప్రమాదంగా వుందనీ ఆపరేషన్ అవసరమనీ అయినా భయపడవద్దనీ రావుకు ధైర్యం చెప్పి పార్వతి పక్క వార్డులోవున్న డాక్టర్ గోపాలరావుగారి సహా



యం తీసుకొని ఆపరేషన్ గదిలోకెళ్ళింది. ఆపరేషన్ గది వెలుపల గౌతమ్‌బాబు దాదాపు గంటసేపు ఆందోళన చెందుతూ అటూ ఇటూ తిరిగాడు.

తెల్లవారింది. అహల్య బ్రతికి బయటపడింది. పాప [illegible] [illegible] అహల్య [illegible] డుకు గుండెలోని బరువంతా ఒక్కసారిగా

బయటికి వొదిలేసాడు.

వారం రోజులు గడిచిపోయాయి. అహ ల్యను హాస్పిటల్ నుంచి డిస్‌ఛార్జి చేస్తూ పార్వతి, గౌతమ్‌రావును తన గదిలోనికి పిలిచి ఆపరేషన్ సమయంలో అహల్య గర్భసంచిని తీసివేయడం జరిగిందనీ, ఇక ఆమెకు సంతానం కలిగే అవకాశం లేదనీ బాధపడుతూ చెప్పింది. రావు షాక్ తిన్నవా డిలాగా అయిపోయాడు. ఆమె అతన్ని వోదార్చింది. కొంతకాలం వరకూ అహల్యకా విషయం తెలియనీయవద్దని సలహా చెప్పింది. గౌతమ్‌రావు అహల్యతో ఇంటికి బయలుదేరి వెళ్ళాడు.

రోజులు బరువుగా గడిచిపోతున్నాయి. అహల్య శారీరకంగా కోలుకుంటూ వుంది. మానసికంగా కుంగిపోతూ వుంది. రావు మామూలుగా కాలేజీకి వెళుతున్నాడు. అవ సరముంటే తప్ప తక్కువ సమయాల్లో మౌనంగా వుంటున్నాడు. అతని మనసులో తర్క వితర్కాలు పొంగి అణిగిపోతున్నాయి. ఏకాంతంలో కాసేపు గుండె బరువుకావడం వెంటనే తేలికపడడం జరుగుతూ వుంది. అహల్య అతనికి వీలయినంత వరకూ దూర ంగా వుంటూ వుంది. అతడు కాలేజీకి వెళ్ళిపోగానే మాటిమాటికీ ఆ భయంకర దుర్ఘటన తలచుకొని కుమిలిపోతూ వుంది. ఏకాంతం ఆమెకు భరించరానిదైంది.

అహల్యకు సహాయంగా వుంటుందనీ ఈ సమయంలో ఆమె ఏకాంతంగా వుండడ ం మంచింది కాదనీ రావు తన తల్లిని వూరినుంచి పిలిపించడానికి ప్రయత్నించా డు. ఇపుడెవరొచ్చినా పరిస్థితినిబట్టి జరిగిన దాన్ని తెలుసుకుంటారని, అది తనకిష్టంలేద నీ అహల్య అతని ప్రయత్నాన్ని తిరస్కరించి ంది. విషబిందువులు పడిన పాలకుండలాగా తయారైన తన జీవిత రహస్యం ఇతరులెవ్వరి కీ తెలియకూడదని ఆమె నిశ్చయించుకుంది . అయితే డాక్టర్ల కావిషయం తెలియక తప్పలేదు. దాన్ని అహల్య భరించలేకపోయిం ది.

రోజులు గడిచేకొద్దీ అహల్య తన్నుతాను అసహ్యించుకోసాగింది. రావు మౌనంగా వుండడం ఆమెకు మరింత వేదన కలిగిస్తూ వుంది. ముఖమెత్తి అతన్ని చూడ్డానికయినా ఆమె ఇష్టపడడంలేదు. ఇరువురిమధ్యా మొ న్నటిదాకా వెల్లివిరిసిన ఆనందాల హరివిల్లు అంతరించిపోయింది. రాత్రివేళల్లో గౌతమ్ తన పక్కనున్నాడన్న తృప్తేకానీ వెనకటిలా గా ఆ మధురమైన క్షణమొకటీ లేదు. అది భరించలేకపోయిందామె. అందమైన గతాన్ని తలచుకొని ఆమె పసిపిల్లలా యేడిస్తే అతడా మెను దగ్గరికి తీసుకొని "పిచ్చిదానా, మాటిమాటికీ గతాన్నెందుకు స్మరించుకుం టావ్? ఆరోగ్యం కూడా సరిగాలేదు. ప్రశాంతంగా వుండాలి" అంటూ వోదారు స్తాడు. ఆ వోదార్పులో యేదో వెలితి వుందని, తనకూ అతనికీ మధ్య యేదో అగాధం పెరుగుతూ వుందని ఆమె అనుకో సాగింది.

ఆ సమయంలో, తనకారోగ్యం బాగుంద నీ గతాన్ని స్మరించుకోవడంలేదనీ వెనకటి అనురాగాన్ని కోరుతున్నాననీ అతనికి చెప్పాల నుకుంటుందామె. వెంటనే మనసునిండా యేదో చెప్పరాని చేదు నిండుకొని అతని

అనురాగాన్ని కోరుకోడానికి తనకర్హత లేదేమో అని తనలో తాను తర్కించుకుంటుంది. ఆ మానసిక సంఘర్షణతో అతని పాదాలమీద వాలి, "నేను చచ్చిపోతానండీ, ఈ మలినమైన శరీరంతో మీదగ్గరుండలేను. దయచేసి నన్ను మరిచిపొండి" అంటూ అమాయకంగా బోరున యేడుస్తుంది.

"ఛీఛీ యేమ్మాటలవీ! నిన్ను చంపుకోడానికేనా బ్రతికించుకున్నది" అంటూ అతడు ఆమెను తన వొడిలోకి తీసుకొని సముదాయిస్తాడు. ఆ సమయంలో అతని అణువణువూ ఆమె ప్రేమకోసం మూగగా ఆక్రోశిస్తుంది. ఆ సమయం గడిచిపోతుంది.

ఆమె కన్నీళ్ళతో అతని ఔదార్యంతో కాలం బరువుగా సాగిపోతూ వుంది. సమాజంలోని సమస్యలన్నింటికీ తానే పరిష్కారమవుతూ నడిచిపోతూ వుంది.

గౌతమ్‌రావు మనసులో అపుడపుడు ఆ చేదు సంఘటన మెదులుతూనే వుంది. ఎంత మరచిపోవదామనుకున్నా మరుపు రావడంలేదు. ఒక్కోసారి దాని భయంకర జ్ఞాపకాలు అతని రక్తాన్ని వేడెక్కిస్తాయి. ఆ సమయంలో అతని నరనరాల్లో యెవరిమీదో చెప్పరానంత కసి పెరుగుతుంది. వెంటనే తన్నుతాను కంట్రోల్ చేసుకుంటాడు. తర్క వితర్కాలతో కాసేపటికి మనసు తేలిక పడుతుంది.

ఒకరోజు సాయంకాలం గౌతమ్‌రావు మిద్దెపైన ఈజీఛేర్‌లో కూర్చొని పడమటివైపు ఆకాశంలో రకరకాల రూపాలందుకొంటున్న మేఘాలవైపు చూస్తున్నాడు. చూపులయితే మేఘాల్లో చిక్కుకున్నాయి కానీ మనసు మాత్రం పరధ్యానంలో మునిగిపోయింది. ఉదయంనుంచీ పట్టణంలో సంచలనం సృష్టించిన బోటనీ మేడమ్ ఊర్వశి హత్యను గురించి ఆలోచిస్తున్నాడతడు. ఆమెను రెండ్రోజుల క్రితం దుండగులెవరో కిడ్నాప్ చేసారు. నిన్న సాయంకాలం ఆమె ఎలాగో రౌడీల బారినుండి తప్పించుకొని ఇల్లు చేరుకుంది.



## అపవాదు

"సోదర సోదరీ మణులారా, మా రాజకీయ నాయకులు అయిదేళ్ళకోకసారే, ఓటర్లకు ముఖం చూపిస్తారని అపవాదు ఉంది. అది నిజంకాదని చెప్పడానికి, పదిహేను నెలలకే మీ ముఖం చూడటానికి వచ్చామని, సగర్వంగా మనవి చేసుకుంటున్నాను".

— వి.వి. సీతారామ్‌దాస్ (గుంటూరు).

ఆ సంగతి తెలిసి మిత్రులూ తోటి లెక్చరర్లందరూ ఆమెను పరామర్శించి ఆమె భర్త నవనీతరావును వోదార్చి వచ్చారు. ఈ ఉదయమే ఆమె మృతదేహం రైలుపట్టాలమీద పడివుండడం ప్రజలందరికీ ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా కాలేజీ స్టాఫ్ మెంబర్స్‌లో ఆమె వుదంతం చాలా వేడివేడిగా చర్చకు వచ్చింది.

ఊర్వశి కిడ్నాప్ విషయం గౌతమ్‌రావు మనస్సును గతంలోకి బలవంతంగా ఈడ్చుకెళ్ళింది. మనసును ఇంకా గాయం చేస్తున్న ఆనాటి భయంకర సంఘటన అతని కళ్ళముందు సినిమా రీల్లాగా కనిపించసాగింది.

* * *

సెకండ్ షో సినిమా వొదిలారు. అహల్యతోకూడి గౌతమ్‌రావు హాల్లోనుంచి బయటికి రావడానికి పదినిమిషాలు టైం పట్టింది. సినిమా కొత్తది కావడంతో రద్దీ బాగా వుంది. రావు అతి కష్టమ్మీద తన స్కూటర్ని బయటికి తోసుకుని వచ్చి స్టార్ట్ చేసాడు. వెనకసీట్లో అహల్య కూర్చుంది.

పోనుపోనూ జనం పల్చబడడంవల్ల వీధి లైట్ల వెలుతుర్లో స్కూటర్ హాయిగా ముందుకు పోతూవుంది. చిలకా గోరింకల్లాగా నవ్వుకుంటూ సినిమా ముచ్చట్లు నెమరేసుకుంటూ శీతాకాలం కొరుక్కుతింటున్నా లెక్కచేయకుండా స్వర్గసీమల్లోకి పోతున్నట్లు హాయిని మేసుకుంటూ పోతున్నారు దంపతులిద్దరూ.

స్కూటర్ వోవర్ బ్రిడ్జి దాటి పోలీసు ట్రైనింగ్ కాలేజీ పక్కనున్న రోడ్లో పోతూ వుంది. ఎడమవైపున ఎత్తయిన రైలు రోడ్డూ, కుడివైపున స్టేడియం గోడా వున్నాయి. స్టేడియం గేటు దగ్గర కరెంటు స్తంభంపైన పెద్ద డూమ్ లైట్ కళ్ళు మిరుమిట్లు గొలిపేలాగా వెలుగుతూ వుంది.

స్టేడియం గేటు దగ్గరికి చేరుకోగానే స్కూటర్ వెనక చక్రంలో గాలిపోయింది. స్కూటర్ షేకయింది. అహల్య భయంతో గాబరా పడిపోయింది. గౌతమ్‌రావు బ్రేకు తొక్కి కిందపడిపోకుండా స్కూటర్ని కంట్రోల్ చేసి నిలిపాడు. ఇద్దరూ కిందికి దిగి చూసారు. ఇనుపముక్క గుచ్చుకొని టైర్ చీలిపోయింది.

అపుడేం చేయాలో గౌతమ్‌రావుకు దిక్కుతోచలేదు. స్కూటర్‌ని తోసుకుపోవడానికి వీలుకాలేదు. స్టెప్నీ టైరేమో వుంది. కానీ వెనకవైపు గాలిపోయిన టైర్ బయటికి తీసి స్టెప్నీ టైర్ వేసుకోవడం ఆవేళప్పుడా చలిలో వీలుకాదనిపించింది. పోనీ స్కూటర్కి లాక్‌వేసి నడుచుకు పోదామనుకుంటే ప్యాంట్ జేబులో కీస్ లేవు. సినిమా ముస్తాబులో, వొదిలేసిన ప్యాంట్ జేబులోవున్న కీస్ తీసుకోవడం మరిచాడు. సరే, స్కూటర్ని అలాగే రోడ్లో లాక్ చెయ్యకుండా వొదిలేసి పోడానికి మనసు తటపటాయించింది. రోడ్డుకిరువైపులా స్టేడియం గోడా రైలు రోడ్డూ చాటుగా వుండడంవల్ల ఆ అర్ధరాత్రి సమయంలో జనం అలికిడే లేదు. ఆవేళప్పుడు అహల్యతో అక్కడెక్కువ సేపుండడం మంచిది కాదనిపించింది. అహల్య కూడా 'వెళ్ళిపోదాంపదండీ' అంటూ తొం

దర చేయసాగింది.

గౌతమ్‌రావు ఒక నిర్ణయానికొచ్చి మనసును కుదుటపర్చుకొని అహల్యతో అక్కడ నుంచీ వెళ్లిపోడానికి అడుగు ముందుకు వేశాడు. సడన్‌గా అటువైపునుంచీ రైలు రోడ్డు దాటి ఎవరో ముగ్గురు వ్యక్తులు కిందికి దిగివచ్చారు. వాళ్లను చూసి అహల్య భయపడుతూ రావు వెనక వైపునకెళ్లి అతని చేయి పట్టుకుంది. ఆ వచ్చిన ముగ్గురు వ్యక్తులూ స్కూటర్ దగ్గర ఆగి వీళ్ళిద్దర్నీ 'యెగాదిగా' చూడసాగారు. ఒకడు అహల్యను నఖశిఖ పర్యంతం చూడసాగాడు. మరొకడు రావు నడిగి జరిగిన విషయం తెలుసుకున్నాడు. ఇంకొకడు కింద కూర్చొని గాలిపోయిన టైర్ని చూస్తూ ఆమెను వోరగా చూడసాగాడు. వాళ్ల వాలకం చూసి బాగా తాగినట్లున్నారని గమనించాడు రావు. అతని మనస్సు ఆందోళన చెందసాగింది. వెంటనే అక్కన్నుంచీ అహల్యతో పారిపోవడానికి ప్రయత్నించాడు కానీ ఆమె కడుపుతో వుండడంవల్ల సాధ్యంకాలేదు. ఏదయినా కట్టెలాంటి సాధనం కనిపిస్తుందేమోనని చాలా నిశితంగా చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు రావు.

డూమ్ లైటు వెలుతుర్లో వాళ్ళ కళ్ళవైపే చూస్తున్నాడు రావు. ఒకడు స్టేడియం గేటులోనికెళ్లి వచ్చి కూర్చునవాని చెవిలో యేదో చెప్పాడు. మరొకడు రైలు రోడ్డెక్కి మళ్లీ తిరిగి వచ్చాడు. వాని చూపులు కూర్చున్నవాని కళ్లతో యేదో మాట్లాడాయి. కూర్చున్నవాడు సడన్‌గా పైకిలేచి "ఊ నోరు తెరిచినారంటే ప్రాణం తీసేస్తాన్" అంటూ కత్తి చూపాడు. తక్కిన ఇద్దరూ అహల్యను పొదివి పట్టుకున్నారు. ఆమె భయంతో వాళ్ళ చేతుల్లోనుంచీ తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ వుంది. గౌతమ్ ఆవేశంతో వాళ్ళను పక్కకు లాగి పారేయడానికి శతవిధాలా ప్రయత్నించసాగాడు. అతని వ్యవహారమూ, లాగడమూ కఠినంగా వుండడంతో చేతిలో కత్తి పట్టుకున్నవాడు కోపంగా రావు పొట్టలోకి కత్తి చెక్కబోయాడు.



## షాదీ

అప్పుడెప్పుడో 'మందాకిని' పెళ్లి గురించి అడిగితే 'హా... షాదీ కర్‌దీ' అని వాలిక కొరుక్కుంది తల్లి...

"అయితే ఇంతకీ ఎవరా హీరో" అనడిగితే ముందన్న మాటను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తూ... 'హా... హా... కర్‌దేంగే షాదీ" అని మాట మార్చింది.

ఇంతకీ ఇప్పుడు విషయం ఏంటంటే... మందాకిని, తల్లి, వాళ్ల ఫామిలీ... వీళ్లెవరూ ప్రస్తుతం కనిపించడం లేదు.

అంటే 'మందాకిని రహస్యంగా పెళ్లి చేసుకుంది' అన్న రూమర్స్ నిజమే అయివుండొచ్చు.

—వింజమూరి కృష్ణమూర్తి

పెనగులాటలో అది అతని చేతికి గుచ్చుకుంది. రావు అబ్బా అని గట్టిగా అరిచాడు. తన భర్తను చంపుతారేమోనన్న భయంతో అహల్య యేడుస్తూ "మీకు పుణ్యముంటుంది. దయచేసి మమ్మల్నేమీ చెయ్యకండి. మీక్కావలసింది నగలేకదా, తీసిస్తాను. ప్లీజ్ మమ్మల్నేమీ చెయ్యకండి" అంటూ ప్రాధేయపడింది.

"ఏయ్, అరిచావంటే నీ కళ్ళముందే వీని ప్రాణం గాల్లో కలిసిపోతుంది జాగ్రత్త. నీ నగలెవ్వరిక్కావాలే, నువ్వేకావాల. ముందు నోర్మూసుకొని లోపలికి నడు" అంటూ తక్కిన ఇద్దరూ మోటార్ సైకిల్ చైన్లూ కత్తులూ చూపి స్టేడియంలోనికి నడవండని వాళ్లను బెదిరించారు. అహల్య వొణికిపోయింది. రావు చైతన్యం కోల్పోయాడు. ముగ్గురూ చుట్టుకొని వాళ్ళిద్దర్నీ గేటుగుండా స్టేడియం లోనికి లాక్కెళ్లారు. రావు రాబోయే ప్రమాదాన్ని తలచుకొని పిచ్చివాడైపోయాడు. కోపం భరించలేక వెర్రి ఆవేశంతో వాళ్ళమీదికి విరుచుకుపడ్డాడు. నల్లగా బలిష్టంగా వున్నవాణ్ణి యెగిరితన్నాడు. వాడు కిందపడబోయి నిలదొక్కుకొని మత్తునుంచీ తేరుకొని దెబ్బతిన్న నాగులాగా వచ్చి "మేరా బేటా, సినిమా హీరో అయిపోదామనుకున్నావా? వొడిసి పారేస్తే నీకు దిక్కెవ్వరా! మామీదే చేయి జేసుకుంటావా?" అంటూ పిచ్చికోపంతో పళ్ళు బిగబట్టి ఇనప చైనులో గౌతమ్‌రావును చావమోదాడు. మరొకడు పిడికిలి బిగించి చేతికొద్దీ గుద్దాడు రావు కిందపడిపోయాడు.

అహల్య గుండెలు బాదుకుంటూ నోరెండిపోయి అరవలేక నల్లగావున్న వాని కాళ్ళు గట్టిగా పట్టుకొని "దయచేసి ఆయన్ని కొట్టకండి మీక్కావలసింది నేనేకదా. నన్నేమయినా చేసుకోండి. ప్లీజ్, ఆయన్ని కొట్టకండి. నా పసుపుకుంకుమ చెడిపెయ్యకండి" అంటూ కిందపడిన తన భర్త శరీరాన్ని పుడుకుతూ గొంతు పెగిలిరాని విధంగా విలపిస్తూ మెల్లగా "... అండీ యెక్కడ తగిలిందండీ? మీరేమీ వాళ్లనెదిరించకండీ. నేనేమయిపోయినా ఫరవాలేదు... ప్లీజ్, మీరు మౌనంగా వుండండి. లేకుంటే ఇద్దరు ప్రాణాలూ తీస్తారండీ... నేను చూళ్ళేనండీ. ప్లీజ్, మీరూరకే వుండండి" అంటూ ముఖాన్ని చేతుల్లో దాచుకొని యేడవడానిక్కూడా శక్తిలేక పలవరించింది. వాళ్ళ బెదిరింపులతో మూలగడానికైనా అవకాశం లేక గౌతమ్‌రావు వూపిరి బిగబట్టి రోషం నింపుకున్న చూపుల్తో చూస్తున్నాడు.

రౌడీలు ముగ్గురూ యేదో మాట్లాడుకొని అటువైపు నడవమని అహల్యకు సైగ చేసారు. ఆమె యేమిచేయాలో దిక్కు తెలియక భయపడిపోతూ చేతులెత్తి దీనంగా నమస్కరించింది. ఒట్టి మనిషిని కావనీ, గర్భవతిననీ పొట్లో చెరుగు పెట్టుకొని ముందుకు పోతే యేమవుతుందో, మొండికేసి కూర్చుంటే తన గౌతమ్‌ను యేం చేస్తారో అని కంపించిపోయింది. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. శబ్దం లేకుండా దీనాతిదీనంగా విలపించడం తప్ప, ప్రాధేయపడడం తప్ప మరేమీ చేయలేకపోయింది. వాళ్లు గౌతమ్‌రావును లాక్కెళ్ళి


స్టేడియం హాల్లో ఒక స్తంభానికి కట్టివేయని గారు. సైకిల్ చైన్క్రింద నలిగిపోతూ రావు బలమంతా వుపయోగించి గుంజులాడసాగా డు. దాంతో చికాకెత్తిన వల్లిటివాడు రావు వీపుమీద చైన్‌తో మోదాడు. అహల్య గభాలున అతని కాళ్లకడ్డంపడి "— ప్లీజ్, కొట్టకండీ, మీకు పుణ్యముంటుందండీ" అని దేవురించింది.

"అయితే మేం చెప్పినట్లు చెయ్ నువ్వేమీ గలాటా చెయ్యకుండా మాకు లొంగిపో. వీన్ని నోరెత్తకుండా వుండమని చెప్పు" అని వాళ్లు షరతు పెట్టారు.

అహల్య ఘోరంగా యేడుస్తూ వాళ్ళ చేతుల్లోనుంచి భర్తవైపు చూస్తూ చేతులు చాపి "అండీ, మీరేమీ మాట్లాడొద్దండీ.. . ప్లీ...జ్" అంటూ కొంగు నోట్లో పెట్టుకుని కుమిలిపోసాగింది. ఒకడామెను గట్టిగా పట్టుకున్నాడు. తక్కిన ఇద్దరూ గౌతమ్‌రావును స్టేడియం హాల్లో స్తంభానికి కట్టివేసారు. ఒకడు రావు దగ్గరే అతన్ని అరవనీకుండా కత్తిపట్టుకొని నిల్చున్నాడు. మిగిలిన ఇద్దరూ ఆమెను స్టేడియం వరండా లో దూరంగా తీసుకెళ్లారు.

చీమ చిటుక్కున్నా వినిపించే ఆ నిశ్శబ్ద నిశీథంలో అహల్య దీనాలాపాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. వింటున్న గౌతమ్‌రావు జీవనాడులు తెగిపోతున్నాయి. పొంగిపొర్లుతు న్న కన్నీటి బిందువులు నిస్సహాయంగా పెదవుల మధ్యలోపడి నలిగిపోతున్నాయి. హృదయం ఇతరుల సహాయం కోసం మౌనంగా ఘోషిస్తూవుంది.

స్టేడియం వెలుపల రోడ్లో తమ స్కూ టర్ దగ్గరే కావొచ్చు, ఎవరో సైకిల్ బెల్ మోగిస్తూ మాట్లాడుతున్నట్లున్నారు. రావు మనసు ఆశతో తొందర చేసింది. అతడు గట్టిగా అరవాలనుకున్నాడు. అంతలోనే పాసి ష్టి రైలు కూత వేసుకుంటూ వచ్చింది. అతని పళ్ళు కోపంతో బిగుసుకుపోయాయి. రైలు వెళ్లిపోయింది. ఇంతకుముందు వినిపించి న మనుషుల మాటలు వినిపించలేదు. మళ్లీ



అంతా నిశ్శబ్దం.

దూరంగా పెమగులాటలు. అహల్యా దీవాలాపాలు. వాళ్ళ బెదిరింపులు. కాసేపు నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో గౌతమ్‌రావు చెవులు భరించలేని సవ్వడిలేని శబ్దాలు. ఒక్కసారిగా రావు 'అహల్యా' అంటూ గట్టిగా అరిచాడు.

* * *

ఇంట్లో యేదో పనిచేసుకుంటున్న అహల్య ఏమండీ ఏమయిందండీ అంటూ గబగబా మిద్దెపైకి వచ్చి అతని ఛాతీ మీద చేయివేసి నిమిరింది. రావు చేదుజ్ఞాపకాల్లో నుంచి తేరుకొని అహల్యను దగ్గరికి చేర్చుకున్నాడు. కల్లాకపటం తెలియని ఆ యిల్లాలిని చూస్తూ నిర్మలమైన మనసుతో ఆమెను గుండెలకు హత్తుకొని అప్పుడప్పుడే వినిర్మలమైన ఆకాశంలో తూర్పున ఉదయిస్తున్న పున్నమి చందమామను చూస్తూ వుండిపోయాడు రావు.

రోజులు వేగంగా దొర్లిపోతున్నాయి. అహల్యపట్ల గౌతమ్‌రావు మనసు విశాలమవసాగింది. ప్రకృతి పరిశీలనతో, సంఘం నిర్మించుకొన్న స్త్రీ పురుష సంబంధాల పరమార్థం అర్థమవుతూ వచ్చింది. పాంభౌతికమయిన శరీరాన్ని భావ సంబంధమైన మనస్సు చూసే విధానమెలాంటిదో తెలియవచ్చింది. బంధుత్వాలూ, అనుబంధాలూ, ఆత్మీయతలూ, కోపతాపాదులూ, మంచిచెడ్డలూ, పాపం పుణ్యం, శీలం, పాతివత్యం మొదలయినవన్నీ మనసుకు చెందినవేకానీ భౌతికమైన శరీరంతో సంబంధం లేదనిపించింది. మరోవైపు సాంఘిక నియమాల్లోని అంతరార్థమూ స్ఫురింపసాగింది. మనసు విశాలమైతే దేనినయినా భరించవచ్చునేమో అనిపించిందతనికి.

* * *

ఆరోజు శనివారం. సాయంకాలం కావొచ్చింది. పక్కవీధిలో రామస్వామి దేవాలయంలో హరికథా కాలక్షేపముందనీ తాము వెళ్లొస్తామనీ బయలుదేరింది అహల్య. తొందరగా వచ్చేయమని చెప్పి రావు మిద్దెపైన ఈజీఛేర్‌లో కూర్చొని ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి వింటున్నాడు. పురాణపఠన కార్యక్రమం వినిపిస్తున్నది. పరాశర మహర్షికీ, మత్స్యగంధికీ చెందిన కథ వింటూ నవ్వుకున్నాడు రావు. పరాశర మహర్షివల్ల మత్స్యగంధికి వేదవ్యాసుదు పుట్టడం, తర్వాత ఆమె సత్యవతిగా శంతనునికి భార్య కావడం, అంబికా అంబాలికలను వ్యాసుని వల్ల సంతానం కలగడంవల్ల పెళ్ళి కాకముందే కుంతికి కర్ణుడు పుట్టడం, పెళ్ళయ్యాక ఆమెకు ఇంద్రాదులవల్ల పాండవులు జన్మించడం మొదలైన పురాణ కథలన్నీ పరంపరగా అతని మనసులో మెదిలాయి. పురుషుడు స్త్రీ జీవితానికి గీసిన లక్ష్మణరేఖలు స్ఫురించాయి. జీవతత్వం ప్రకృతి తత్వం సంఘతత్వం గురించి ఆలోచనలు బయలుదేరాయి. ఇంకోవైపు శ్రీకృష్ణుని రాసలీలలూ, ఆధ్యాత్మికవాదులు శ్రీకృష్ణుని బ్రహ్మచారిగా భావించడంలో అంతరార్థం గురించి ఆలోచించాడు. సామరస్యమైన జీవన సౌకర్యం కోసం కల్పించుకొన్న సాంఘిక ధర్మాలను గురించి

తర్కభావంతో విశ్లేషణ చేసేకొద్దీ అతని మనస్సు తేలికపడసాగింది.

దూరంగా గుడిలో 'గోవిందా' శబ్దాలు వినిపిస్తున్నాయి. హరికథ ప్రారంభమయినట్టుంది. "అహల్యాశాపవిమోచనం" కథను చెప్పబోతున్నానని హరిదాసు హరికథ చెప్పడం మొదలుపెట్టాడు. భక్తాదులు మైకు నేర్పాటుచేసినట్టుంది. మిద్దెమీద కూర్చున్న గౌతమరావుకు హరిదాసు మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి. కంఠం మనోహరంగా వుంది. రావు కాసేపు హరికథ మీదికి దృష్టి మళ్లించాడు. మధ్య మధ్యలో కొన్ని మాటలు గాలివల్ల సరిగా వినిపించడంలేదు.

రావు మనసులో రామాయణంలోని అహల్యకథ మెదిలింది. వెంటనే తనలో తాను నవ్వుకొని తన అహల్యపట్ల తాను మాత్రం గౌతముణ్ణి కానని అంతరాత్మకు సమాధానం చెప్పుకున్నాడు.

మైకు సరిగా పనిచేయడంలేదేమో అప్పుడప్పుడు హరిదాసు మాటలు స్పష్టంగా వినపడడంలేదు. రావు టైం చూసుకొని ఇంక కాసేపట్లో హరిదాసు కథ చెప్పడం ముగిస్తాడనుకొని అహల్యను పిలుచుకురావడానికి గుడివైపు వెళ్లాడు. ఇంకా హరికథ సాగుతూ వుంది. భక్తాదులు ప్రశాంతంగా వింటున్నారు. తన అహల్య ఎదురుగా స్తంభానికి ఆనుకొని కూర్చొని వుండడం గమనించాడతను.

"వంచకురాలైన అహల్య అలా పాషాణంగా మారిపోయింది" అంటూ కథలోని అహల్య శీలాన్ని వ్యాఖ్యానిస్తున్నాడు హరిదాసు

స్తంభానికానుకొని కళ్ళు మూసుకొని కూర్చున్న అహల్య చెక్కిళ్లమీద కన్నీటి చారలు లైటు వెలుతుర్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అది గమనించిన రావు మనసు కలతచెందింది. "ఉండుండీ, తన అహల్య ఈ కథను వినవలసివచ్చిందా" అనుకున్నాడతడు

ఆ కథను వినడంవల్ల ఆమె మనస్సు మళ్లీ గందరగోళమవుతుందేమో అనిపించిందతనికి. అంతలోనే హరిదాసు మిగిలిన కథను



## ఉం...గరం

*ఎంగేజ్‌మెంట్ రింగ్ ఎప్పుడు వేలికి పెడతాడా 'బాబీ' అని ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తోంది నీలం.*

*పాపం! బాబీ డియోల్ అంతకన్నా ఎక్కువ ఆత్రంగానే వెయిట్ చేస్తున్నాడు... ఇంకా ఎంతకీ ప్రారంభం కాని తను నటించబోయే సినిమా... ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ ఎప్పుడు చేతికందుతుందా అని...*

*ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇన్‌కమ్‌లోనే రింగ్ కొనాలని బాబీ ప్రయత్నం... కోరిక.*

—వింజమూరి కృష్ణమూర్తి

రేపు విన్నవించుకుంటావని కథ చెప్పడం ముగించాడు. మవునంగా ఇంటికి బయలుదేరింది అహల్య. ఆమెను అనుసరించాడు గౌతమ్‌రావు.

అహల్య భోజనం చేయలేదు. ఆమె మనసంతా వికలమైనట్లుంది. అతడెంత చెప్పినా ఆమె సమాధానపడలేదు. మొన్న నర్స్ రాధ కనిపించి తనకు ఆపరేషన్ జరిగిన విషయం గురించి చెప్పినప్పట్నుంచీ తాను బ్రతకడం వ్యర్థమనుకుందామె. ఎటు వెళ్ళినా యేంచేసినా ఆ జ్ఞాపకాల నీడలు వెన్నాడుతూ దహించి వేస్తున్నాయి. ఎన్నోసార్లు ఆత్మహత్యకు సిద్ధపడిన తాను గౌతమ్ చూపే ప్రేమానురాగాలు మనసులో మెదలగానే ఆ ప్రయత్నం నుంచీ విరమించుకుంది. కానీ ఈరోజు హరిదాసు చెప్పిన అహల్య కథ విన్నతర్వాత మనసునిండా యేదో విరక్తి చోటుచేసుకుంది. తనమీద తనకే అసహ్యం కలగసాగింది. ఇంక బ్రతకడమెందుకన్న నిర్ణయానికొచ్చిందామె.

''అహల్యా! నా మనసునర్థం చేసుకోలేవా? ఏవో పనికిమాలిన కథలు విని మళ్ళీ యేమిటీ మూర్ఖత్వం!'' అని రావు ఆమెను మందలించాడు.

''లేదండీ, అవి పనికిమాలిన కథలు కావు. నాలాంటిదానికోసం చెప్పిన కథలు. అహల్య అమాయకురాలే కావొచ్చు. కానీ ఆమె దేవతలవల్ల చెడిపోయింది. అందుకు ప్రాయశ్చిత్తంగా రాయిగా మారిపోయింది. ఇపుడు నాకూ అదే ప్రాయశ్చిత్తం కావాలి. ఏ కాయలూ కాయని వొక విషవృక్షంలాగా నేను బ్రతకలేనండీ. నాకీ జీవితం నుంచీ విముక్తి కావాలి'' అంటూ బెడ్‌మీద పడి యేడవ సాగింది అహల్య.


గౌతమ్‌రావు ఆమె మానసిక దౌర్బల్యాన్ని చూసి బాధపడ్డాడు. ఆమె దగ్గరికి చేరి ఆమెను తనవైపు లాక్కొని కన్నీళ్ళు తుడుస్తూ ''అహల్యా, పసిపిల్లలాగా యేమిటీ అమాయకత్వం? మనం రాముని కాలంలో వున్నామా యేమిటి? అది కథ మాత్రమే'' అన్నాడు రావు. ఆమె లేచి పక్కన కూర్చొని ''అది కథే కావచ్చు. కానీ సంఘంలో దానికి గౌరవముంది. ఈ నాటికీ అహల్యను శీలంలేనిదానిగానే సమాజమనుకుంటూ వుంది'' అంటూ వాదించింది. రావు ఆమె అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. ''గౌతమ మహర్షిలాగా సమాజం కోసం అమాయకురాలైన భార్యను దూరం చేసుకునే త్యాగం నాకవసరం లేదహల్యా. అహల్య కథను ఏ సమాజం గౌరవిస్తున్నదో ఆ సమాజమే పెళ్ళికాకముందే బిడ్డల్ని కన్న మత్స్యగంధీ కుంతీదేవి కథల్ని కూడా గౌరవిస్తున్నది. భర్తలుండగానే పరపురుషుల వల్ల సంతానం పొందిన పురాణస్త్రీలను ఈ సంఘం ఆదరిస్తున్నది. ఈ సమాజం గురించి మనకెందుకు? అయినా కట్టుకున్న వానికి నాకు బాధ లేనపుడు చేయని నేరానికై సంఘం కట్టుబాటుకోసం నిన్ను ప్రాణంగా చూసుకునే నాకు దూరమై పోతావా అహల్యా? నాకంటే సమాజమే నీకు ముఖ్యమా? నువ్వే నా సర్వస్వమనుకున్నానే...'' అంటూ అతడు కనుగుడ్లమీద నీళ్లు నింపుకున్నాడు.

అహల్య అతని కళ్లల్లోకి చూసి భరించలే


క నోట మాట రాక మౌనంగా తానూ కన్నీళ్ళు నింపుకుంది. అతడామెను మరింత దగ్గరికి చేర్చుకొని ఆమె కన్నీటిని తుడుస్తూ వోదార్చాడు. గుండెకు హత్తుకున్నాడు. అహల్య పసిపాపలా విలపించింది. అతడామెను లాలిస్తూ తలమీద గడ్డమాన్చి ఆమె వీపు నిమురుతూ కళ్లు మూసుకున్నాడు. అప్రయత్నంగా కన్నీటి బిందువులు ఆమె తలమీద సరికొత్త అక్షింతలలాగా పడసాగాయి. అతను స్పర్శలో యేదో కొత్త అనుభూతి. ఆ లాలింపులో యేదో తెలియరాని తృప్తి. తప్పిపోయిన విలువైన వస్తువు దొరికినపుడు కలిగే ఆనందం అతని మనసునిండా పరుచుకుంది. అతని పెదవులు కదిలాయి.

''అహల్యా, విలువైన తెల్లని పట్టు వస్త్రంమీద యేవో మరకలు పడితే ఆ వస్త్రాన్నే వొదిలేస్తామా? నీళ్లలో పిండి మరకలు పోగొట్టుకుంటాం. పోకపోతే ఇంకా ఏమైనా చేసి ఆ మరకల్ని పోగొట్టుకోడానికి ప్రయత్నిస్తాం. అంతేగానీ అది మలినమైందని దాన్ని పక్కకు పడెయ్యము. నీ మనసు నిర్మలమైంది. శరీరమూ నిర్మలమైందే. ఏదో మలినమంటిందనీ అందువల్ల ఈ శరీరం జీవించడానికే పనికిరాదనీ ఎందుకనుకోవాలి? నీ పిచ్చిగానీ, మానసిక సంబంధమైన దిగులు తప్ప చెడిపోవడం గిడిపోవడం వంటి విషయాలకు నిత్య వ్యవహారంలో ప్రమేయముండదు.''

''మగవాడు ఆడదానికి మాత్రమే కల్పించిన శీలకవచం ఆమెను బలహీనురాల్ని చేస్తూవుంది. మగ సంఘం చేసిన కట్టుబాట్లు ఆడదాన్ని మాత్రమే శాసిస్తూ ఆమెను అబలను చేస్తున్నాయి. అందుకే నువ్వింతగా బాధపడుతున్నావ్. ఒకవేళ ఆడవాళ్లచేత పురుషుడే బలాత్కారింపబడి వుంటే ఇంతగా బాధపడతాడా! నువ్వనొచ్చు, ఆడది అరటాకువంటిదని. కానీ ఆ మాటలు కూడా ఆడదాన్ని కించపరచేవే. నువ్వేం



తప్పు చేసావని ఇంతగా బాధపడాలి? నిజానికి నిన్ను నువ్వు త్యాగం చేసుకొని నన్ను కాపాడుకున్నావహల్యా. అందుకే నీలో త్యాగం తప్ప ఇంకేమీ నాక్కనిపించదు. నాకు నువ్వు కావాలి. నీ ప్రేమ కావాలి అహల్యా, ఇంకేమీ మాట్లాడొద్దు'' అంటూ గౌతమ్ ఆమెను గట్టిగా హత్తుకున్నాడు. ఆమె ఆనంద భాష్పాలతో అతని పాదలవైపు పాకసాగింది. అతడు వారిస్తూ ఆమెను తన బాహు బంధంలోకి లాక్కున్నాడు.



డిజైన్ : శారద (జనగాం)